నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, సోమవారం 24 ఫిబ్రవరి 2025 | BHADRADRI KOTHAGUDEM




డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే గెలుపు

- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ ఒక్క సీట్లోనూ గెలవదు
- బీఆర్ఎస్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా

మణుగూరు టౌన్/ దుమ్ముగూడెం, ఫిబ్రవరి 23: ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే గెలుపని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టం చేశారు. ఇప్పటికప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే ఒక్కసీట్లోనూ కాంగ్రెస్ గెలిచే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. మణుగూరు, దుమ్ముగూడెం మండలాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. తొలుత మణుగూరులోని బీఆర్ఎస్ కార్యాలయలో పార్టీ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ దుష్ట పాలనను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో అనునిత్యం పర్యటిస్తూ పార్టీ బలోపేతం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కదానినీ నేరవేర్చని సీఎం.. రేవంత్‌రెడ్డి మాత్రమేనని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, నూకారపు రమేశ్, వట్టం రాంబాబు, యూసుఫ్, యాదగిరి గౌడ్, ఆవుల నరసింహారావు, ముద్దంగుల కృష్ణ, అక్కి నరసింహారావు, పాకాల రమాదేవి, పిన్నమనేని మాధవి, యూత్ నాయకులు పాల్గొన్నారు.

### గజలక్ష్మికి పరామర్శ

బీఆర్ఎస్ దుమ్ముగూడెంలో మండల కో-కన్వీనర్ ఎండీ జానీపాషా సతీమణి గజలక్ష్మి గుండె సమస్యతో బాధపడు తున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు.. ఆదివారం ఆమె నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. హైదరాబాద్ ఆసుపత్రికి వెళ్తున్న ఆమెకు ధైర్యం చెప్పారు.

# కాంగ్రెస్ మాటలు నీటి మూటలుగానే మిగిలాయి

- ఉద్యమకారులను విస్మరిస్తే మళ్లీ ఉద్యమిస్తాం
- ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి
- రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్



ఉద్యమకారుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్

కూసుమంచి, ఫిబ్రవరి 23 : గత ఎన్నికల్లో ఉద్యమకారులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 15 నెలలు అవుతున్నా కనీసం వారి ఊసెత్తడంలేదని, తెలంగాణ కోసం అనేక త్యాగాలు చేసిన వారిని అక్కున చేర్చుకుంటామని ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ అన్నారు. ఆదివారం ఖమ్మంజిల్లా కూసుమంచి మండల కేంద్రంలో జిల్లా ఉద్యమకాలరుల జేఏసీ ఆత్మీయ సమ్మేళనం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుల్తాన్ మాట్లాడుతూ బలిదానాల పునాదులపై ఏర్పడిన తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది ఉద్యమకారులు త్యాగాలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చడమే కాకుండా తెలంగాణద్రోహులను అందలం ఎక్కించడం తగదన్నారు. ప్రజా ఆకాంక్షల మేరకు పరిపాలన జరగాలని కోరారు. బత్తుల సోమయ్య మాట్లాడుతూ ఉద్యమకారుల త్యాగాలపై ఏర్పడిన తెలంగాణలో వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి చూపాలన్నారు. అనేకమంది ఉద్యమకారులు వయస్సు పైబడి అనారోగ్యంగా ఉన్నారని, చివరి దశలోనైనా వారికి గుర్తింపు ఇవ్వాలని కోరారు. సమావేశంలో జేఏసీ సెక్రటరీ జనరల్ ప్రఫుల్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోతి మాధవీరెడ్డి, 1969 ఉద్యమ నాయకులు అన్వర్ పటేల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాల్లారెడ్డి, డిజిటల్ మీడియా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, కోశాధికారి చంద్రన్నప్రసాద్, కళా బృందం నాయకులు డోలక రాములు,
జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న గిమ్మిక్కులు అన్నీ ఇన్నీ కావు. 'ఇందిరమ్మ ఇళ్ల తీరు ఇంతింత గాదయా..' అన్నట్లుగా ఉంది రేవంత్‌రెడ్డి సర్కారు తీరు. 'కుండలో బువ్వ కుండలోనే ఉండాలి. పిల్లలు మాత్రం పుష్టిగా కన్పించాలి' అనే నానుడిలా తయారైంది ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ తీరు. 'పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినట్లుగానే ఉండాలి. ప్రభుత్వానికి ఖర్చు పెరగొద్దు. ఒకవేళ వ్యయం పెరిగితే లబ్ధిదారుడు ఆ ఇంటి నిర్మాణాన్ని మధ్యలో వదిలేయొద్దు. ఒకవేళ అలా వదిలేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది కాబట్టి నా నింద మోయొద్దు. కానీ ఇందిరమ్మ ఇళ్లు అందరికీ అందినట్లు ప్రచారం జరగాలి.' అనే సంక్లిష్టతల నుంచి బయటపడేందుకు అనేకానేక గిమ్మిక్కులు ఆలోచించింది కాంగ్రెస్ ప్రభుత్వం. చివరికి లబ్ధిదారులను ఏమార్చేందుకు నాలుగు నమూనాలను తీసుకొచ్చింది. ఇందులో మొదటగానే 'ఇంటి నిర్మాణం కచ్చితంగా 400 చదరపు అడుగుల నుంచి 500 చదరపు అడుగుల వరకూ ఉండాలి' అనే నిబంధన పెట్టింది. ఇక పిల్లర్లు, భీమ్‌లు వంటివి లేకుండా కొన్ని నమూనాలను; ఐరన్, సిమెంట్, కూలీల ఖర్చులు భారీగా తగ్గించేలా మరికొన్ని నమూనాలను రూపొందించింది. ఈ నమూనా ఇళ్లను మండలానికి ఒకటి చొప్పున నిర్మిస్తోంది. నాణ్యత సంగతి ఎలా ఉన్నా ఈ నాలుగు నమూనాల ప్రకారమే ఇళ్లు నిర్మించుకునే ప్లాన్ చేసింది. పైకి మాత్రం 'లబ్ధిదారుడు తనకు నచ్చిన విధంగా ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవచ్చు' అనే కలరింగ్ ఇస్తుండడం గమనార్హం.

*-అశ్వారావుపేట, ఫిబ్రవరి 23*




అశ్వారావుపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇల్లు

# ఇందిరమ్మ గిమ్మిక్కు.. ఇంతింత గాదయా!

- పేదలకిచ్చే 'ఇందిరమ్మ ఇళ్ల' నిర్మాణంలో లెక్కలేనన్ని లిటిగేషన్లు
- లబ్ధిదారుడికి నచ్చినట్టు కట్టుకోవచ్చంటూనే సవాలక్ష కండీషన్లు
- 'ఇళ్లు' ఇచ్చినట్లుగానే కన్పించాలి.. ఖర్చు పెరగొద్దు.. ప్రభుత్వానికి చెడ్డపేరు రావొద్దు..
- తాము చెప్పిన షరతులకు లోబడే ఇళ్లు కట్టుకునేలా కాంగ్రెస్ సర్కారు ప్లాన్?
- 4 నమూనాలు ఇచ్చామని, లబ్ధిదారుడు దేనినైనా ఎంచుకోవచ్చని బుకాయింపు
- ఈ నాలుగు నమూనాల్లోనే లబ్ధిదారుడు ఏదో ఒకదానిని ఎంచుకునేలా స్కెచ్
- పిల్లర్లు, భీమ్‌లు వంటివి లేకుండా పలు నమూనాల రూపకల్పన..
- ఐరన్, సిమెంట్, కూలీల ఖర్చులు భారీగా తగ్గించేలా మరికొన్ని మోడళ్లు..
- లబ్ధిదారుడు కొద్ది విస్తీర్ణం కూడా పెంచుకోకుండా 500 చదరపు అడుగుల షరతు
- రూ.5 లక్షలకుమించి వ్యయం పెరిగితే లబ్ధిదారుడు మధ్యలో వదిలేయకుండా ప్లాన్
- అలా వదిలేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే కారణంతో లెక్కకు మిక్కిలి లిటిగేషన్లు
- నాణ్యత తగ్గినా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా పకడ్బందీ ప్లాన్లు
- ఇందుకోసం ఓ ప్రైవేటు కంపెనీ నేతృత్వంలో మరికొద్ది రోజుల్లో మేస్త్రీలకు శిక్షణ

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వం డోలాయమానంలో పడింది. మార్కెట్‌లో ఇంటి నిర్మాణ ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో వాటిని తప్పించుకునేందుకు అనేక కుటిల ఆలోచనలు చేస్తోంది. నిర్మాణ ఖర్చు తగ్గించేలా నాలుగు మోడల్స్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం కసరత్తు చేపట్టింది. ఐరన్, సిమెంట్ ఖర్చు తగ్గించేలా నమూనాలను రూపొందిస్తోంది. లబ్ధిదారుడు ఈ నాలుగు నమూనాల్లోనే ఏదైనా ఒక దానిని ఎంచుకునే పరిస్థితిని తెప్పించింది. ఖర్చు పెరిగి ఇంటి నిర్మాణం మధ్యలో నిలిచిపోతే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే దురాలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారుల్లో చర్చ జరుగుతోంది. పైకిమాత్రం లబ్ధిదారుడు తన స్వేచ్ఛ ప్రకారం ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవచ్చని బుకాయిస్తూనే ఆఖరికి ఈ నాలుగు నమూనాల చట్రంలోకి ఇరికించేలా ప్లాన్ చేస్తోంది.



ములకలపల్లిలోని ఇందిరమ్మ నమూనా ఇల్లు

బహిరంగ మార్కెట్‌లో ఇంటి నిర్మాణ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ముఖ్యంగా ఐరన్, సిమెంట్, కూలీల ఖర్చు భారీగా పెరిగిపోయింది. ఈ దశలో 'ఒక నమూనా ఇచ్చి ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షలు ఇస్తే నిధులు సరిపోతాయా? అదనంగా లబ్ధిదారులు వెచ్చించగలడా? ఒకవేళ రూ.5 లక్షలు సరిపోకపోతే లబ్ధిదారుడు ఈ నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేస్తే ఎలా?' అనే సందేహాల నేపథ్యంలో నాలుగు నమూనాలను తెరమీదకు తీసుకొచ్చింది. నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో లబ్ధిదారులు అవసరానికి మించిన విస్తీర్ణంలో ఇంటి పనులు మొదలు పెట్టి నిధులు చాలక మధ్యలోనే ఆపేస్తే ప్రభుత్వం చెడ్డ పేరు మూటగట్టుకోవాల్సి వస్తుందనే అనుమానాలతోనే రేవంత్‌రెడ్డి సర్కారు ఇలాంటి ఆలోచనలు చేస్తోంది

### మండలానికో మోడల్ ఇల్లు..

అలాగే లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై అవగాహన కల్పించేందుకు మండలాని ఒక మోడల్ ఇంటి నిర్మాణం చేపట్టింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి వివిధ శాఖ కార్యాలయాల ప్రాంగణంలో ఈ నమూనా ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం నిర్మిస్తున్న పిల్లర్లు, భీమ్‌లతో కూడిన పద్ధతిలో కాకుండా ఖర్చు తక్కువ అయ్యేలా ఇతర పద్ధతులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మండలానికి ఒకటి చొప్పున వేర్వేరు పద్ధతుల్లో మోడల్ ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోంది. వీలైన ఎక్కువ మంది మేస్త్రీలకు ఆయా పద్ధతుల నిర్మాణాలపై అవగాహన కల్పించేలా ఒక ప్రైవేట్ కంపెనీ నేతృత్వంలో మరికొద్ది రోజుల్లో శిక్షణ కూడా ఇవ్వనుంది.

### వ్యయం తగ్గించేలా నమూనా ఇళ్ల నిర్మాణం..



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ వ్యయం తగ్గించేలా నాలుగు పద్ధతుల్లో నమూనా ఇళ్లు నిర్మిస్తున్నాం. మండలానికో మోడల్ ఇంటి నిర్మాణం చేపట్టాం. లబ్ధిదారులకు నిర్మాణం, వ్యయం తగ్గింపుపై అవగాహన కోసం ఈ మోడల్ ఇళ్లు ఉపయుక్తంగా ఉంటాయి. మొత్తం ఇంటి నిర్మాణం వ్యయం అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. ఏ లబ్ధిదారుడైనా 400 నుంచి 500 చదరపు అడుగుల్లో మాత్రమే ఇంటి నిర్మాణం చేపట్టాలి. అంతకు మించి విస్తీర్ణంలో ఇల్లు నిర్మిస్తే అనుమతించం.

**–రాము, హౌజింగ్, ఏఈ, అశ్వారావుపేట**

### ఆ నాలుగు నమూనాలు ఇవే..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ వ్యయం తగ్గించే విధంగా ప్రభుత్వం పలు పద్ధతులపై అధికారులతో సమాలోచనలు చేస్తోంది. ముఖ్యంగా నాలుగు పద్ధతులను ఇప్పటికే ఖరారు చేసినట్లు సమాచారం. వీటిలో ఏదో ఒక నమూనా ప్రకారం లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది.

#### షియర్ వాల్ పద్ధతి..

ఈ పద్ధతిలో ప్రీ ఫ్యాబ్రికేటెడ్ గోడలను నిర్మాణ స్థలంలోనే ముందుగా సాంచాల ద్వారా కాంక్రీట్‌తో సిద్ధం చేస్తారు. పునాదులపై రంధ్రాన్ని డ్రిల్ చేసి ర్యాడ్స్‌తో ఆ గోడలను అనుసంధానం చేస్తారు. వాటి మీద పైకప్పు వేస్తారు. ఇందులో ఇటుక, స్టీల్ వ్యయం ఉండదు.

#### పిల్లర్ రూఫింగ్ నిర్మాణం..

గోడలపై ఆర్‌సీసీ రాఫ్టర్లు అమర్చుతారు. వాటి మీద పూర్వకాలం తరహాలో బెంగళూరు ఎంకులు పరుస్తారు. పెంకుల మీద రెండున్నర అంగుళాల మందంతో శ్లాబ్ వేస్తారు. ఈ విధానంతో ఇటుక, స్టీల్ వ్యయం తగ్గించొచ్చు.

#### షార్ట్ కాలమ్ ఇన్‌స్ట్రక్షన్..

ఇళ్ల నిర్మాణంలో ఐరన్ వ్యయం చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ ఖర్చును తగ్గించేందుకు ఈ డిజైన్ పద్ధతి ఒకటి. పునాది నిర్మాణం వరకు మాత్రమే కాలమ్స్ ఉంటాయి. పైన ప్లింథ్ భీమ్స్ ఉంటాయి. మధ్యలో పిల్లర్లు లేకుండా కాంక్రీట్ గోడ ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్లలో పైఅంతస్తులు ఉండే అవకాశం లేనందున ఈ నమూనా బాగుంటుందని అధికారుల అంచనా వేస్తున్నారు.

#### స్టోన్ రూఫింగ్ విధానం..

కాంక్రీట్ గోడలు నిర్మించిన తర్వాత.. పూర్వకాలపు దూలాల తరహా పైన ఆర్‌సీసీ రాఫ్టర్స్ ఏర్పాటు చేస్తారు. వాటి మీద షాబాద్ బండలు పరుస్తారు. ఆ బండల మీద తక్కువ మందంతో కాంక్రీట్ పొర వేస్తారు. షాబాద్ బండల లభ్యత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఇది ఉపయోగకరంగా ఉంటుంది.

# గురుకుల ప్రవేశ పరీక్షకు 97 శాతం హాజరు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 23: గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశానికి ఆదివారం ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పరీక్ష జరిగింది. ఖమ్మం జిల్లాలో 18, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 18 కేంద్రాల్లో ఈ పరీక్షను అధికారులు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో 6404 మందికిగాను 6286 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 5089 మందికిగాను 4942 మంది హాజరయ్యారు. మొత్తం హాజరు 97 శాతంగా నమోదైంది. పరీక్ష కేంద్రాలను భద్రాద్రి జోనల్ ఆఫీసర్ స్వరూపరాణి, జిల్లా అబ్జర్వర్ కె.వేణుగోపాల్ సందర్శించారు.



పరిశీలిస్తున్న జోనల్ ఆఫీసర్ స్వరూపరాణి

### ఇద్దరు విద్యార్థులకు అనుమతి నిరాకరణ

ఖమ్మం రూరల్ మండలంలోని ఎస్‌బీసీఈ కళాశాల కేంద్రంలో పరీక్ష రాసేందుకు మోదుగు కృష్ణమనోహర్, ఎం.ధీరజ్ వచ్చారు. వారిని అధికారులు లోపలికి అనుమతించలేదు. దీనికి కారణాలను వారికి అధికారులు వివరించారు. ''నిబంధనల ప్రకారం.. పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రెండులక్షల రూపాయలు మించకూడదు. ఈ ఇద్దరు తల్లిదండ్రుల వార్షికాదాయం రెండులక్షల రూపాయలకు మించి ఉంది. ఆ విద్యార్థులు సమర్పించిన ఇన్‌కం సర్టిఫికెట్‌లో ఇది ఉంది. ఈ కారణంగా, వీరిద్దరూ అనర్హులుగా హెడ్ ఆఫీస్ రిజెక్ట్ చేసింది. కానీ, వారికి మొదట ఆన్‌లైన్‌లో ఆటోమేటిక్‌గా హాల్ టికెట్ వచ్చింది. ఆ తర్వాత, స్క్రూట్నీలో రిజెక్ట్ చేశారు. కలెక్టర్‌కు ఈ సమాచారం ఇచ్చాం'' అని, 'నమస్తే'కు జోనల్ ఆఫీసర్ స్వరూపరాణి వివరించారు.

### అధికారుల తప్పిదం.. విద్యార్థికి నష్టం

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 23: కొందరు అధికారులు అనుసరించిన నిర్లక్ష్యానికి ఓ విద్యార్థికి తీవ్రనష్టం వాటిల్లింది, వివరాల్లోకెళ్తే ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల ఎంట్రెన్స్ పరీక్ష జరిగింది. అందులో భాగంగా ఖమ్మంజిల్లా ఖమ్మం రూరల్ మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్డు వద్ద స్వర్ణభారతి కళాశాలలో ప్రవేశపరీక్షకు సెంటర్ ఏర్పాటు చేశారు. అయితే తప్పిదం ఎక్కడ జరిగిందో తెలియదు కానీ ఇద్దరు విద్యార్థులకు ఒకే హాల్‌టికెట్ నెంబర్ కేటాయించారు. దీంతో ఓ విద్యార్థి ప్రవేశ పరీక్ష రాశాడు. మరో విద్యార్థికి సంబంధించిన తల్లి తన కొడుకు ఎట్టి పరిస్థితిలో పరీక్ష రాసే విధంగా చూడాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. విషయం కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లి నష్టపోయిన విద్యార్థికి తగిన న్యాయం జరిగే విధంగా చూస్తామని గురుకుల పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

### పరీక్షా కేంద్రంలో కలెక్టర్ తనిఖీ

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఫిబ్రవరి 23: నవభారత్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన టీజీ సెట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం; 6, 7, 8 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఆదివారం పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోన్న సోషల్ వెల్ఫర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాల కోసం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులు పరీక్ష రాసే విధానాన్ని గమనించారు. విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. 460 మంది విద్యార్థులకు గాను 444 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని చెప్పారు.



నవభారత్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

# బస్సులున్నయ్.. డ్రైవర్లే లేరు!

- మధిర నియోజకవర్గంలో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- డిప్యూటీ సీఎం ఇలాకాలో ఆర్టీసీ డ్రైవర్ల కొరత
- ఉచిత ప్రయాణం ఉన్నా.. ఉపయోగంలేదంటున్న మహిళలు

మధిర, ఫిబ్రవరి 23 : మధిర ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్ల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. దీంతో మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినప్పటికీ మధిర నియోజకవర్గంలో మాత్రం మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న మధిర నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క ఇలాకాలో ఇలాంటి పరిస్థితి ఉండటం చూసి ప్రజలు ముక్కన వేలేసుకుంటున్నారు. మధిర నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నానని గొప్పలు చెప్పుకుంటున్న భట్టి ఆర్టీసీ డ్రైవర్ల కొరత సమస్యను తీర్చలేకపోతున్నారని చర్చించుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రం మధిర ఆర్టీసీ డిపోలో బస్సులు ఉన్నప్పటికీ డ్రైవర్ల కొరతతో సర్వీసులు తిప్పలేకపోతున్నారు. దీంతో ఉచిత బస్సు ప్రయాణం ఉన్నా ప్రయోజనం ఏమీలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక తక్కువ సర్వీసులు నడిపిస్తున్నందున బస్సులు కిక్కిరిసిపోయి ప్రయాణం చేయడం కష్టంగా మారుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ సమస్య అధిగమించాలంటే మధిర డిపోకు డ్రైవర్ల కొరత లేకుండా చూడాలని కోరుతున్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం రూ.10 కోట్లను మంజూరు చేశారు.. అయినా ప్రయోజనం ఏముందని ప్రయాణికులు వాపోతున్నారు. నియోజకవర్గ ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించడంలో వెనుకడుగు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా మధిర ఆర్టీసీ బస్సు డిపో పరిధిలో కేవలం ఎర్రుపాలెం, మధిర, బోనకల్లు మండలాల్లో కొన్ని గ్రామాల్లో ప్రధానరోడ్డు మార్గం ద్వారా ప్రయాణికులకు బస్సు సౌకర్యాన్ని కల్పించారు. కానీ మారుమూల ప్రాంతాలకు మాత్రం సర్వీసులను నడిపించడానికి అవకాశం లేక మధిర ఆర్టీసీ అధికారులు చేతులెత్తేశారు. ఒకప్పుడు ఈ బస్సు డిపోలో 80 బస్సులు ఉండటంతో ప్రతి గ్రామానికి బస్సులను నడిపించారు.



డ్రైవర్ల కొరతతో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

### డ్రైవర్ల కొరత ఉంది..

మధిర డిపోలో డ్రైవర్ల కొరత వేధిస్తున్నది. డ్రైవర్లుగా పని చేసిన వారు రిటైర్ కావడం, అనారోగ్య సమస్యలతో విధులకు హాజరుకాకపోవడంతో డ్రైవర్ల కొరత ఏర్పడింది. 2009 నుంచి ఇప్పటివరకు ఆర్టీసీ డ్రైవర్ల నియామకం జరగలేదు. ఉన్న డ్రైవర్లతోనే అత్యవసర సర్వీసులను నడిపిస్తున్నాం. డ్రైవర్ల కొరత విషయాన్ని ఆర్టీసీ సంస్థకు తెలియజేశాం. డ్రైవర్లను కేటాయిస్తే బస్సులన్నింటినీ ప్రజల సౌకర్యార్థం మారుమూల ప్రాంతాలకు సైతం నడిపిస్తాం.

**– శంకర్‌రావు, మధిర డిపో మేనేజర్**

అప్పుడు డ్రైవర్లు, కండక్టర్లు పూర్తిస్థాయిలో ఉండటం వల్ల మారుమూల ప్రాంతానికి కూడా ఆర్టీసీ బస్సులు నడిపించారు. ప్రస్తుతం ఆర్టీసీ డిపోలో 46 బస్సులు మాత్రమే ఉన్నాయి. ఈ బస్సులకు పూర్తిస్థాయిలో డ్రైవర్లు లేకపోవడం వల్ల ప్రయాణికుల కోసం సర్వీసులు నడిపించే పరిస్థితి లేకుండాపోయింది. మధిర డిపో నుంచి ఎక్కువగా హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం, వైరా ప్రాంతాలకు మాత్రమే పల్లెవెలుగు బస్సులను ఆర్టీసీ అధికారులు నడిపిస్తున్నారు. మారుమూల ప్రాంతాలకు బస్సులు నడిపించలేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. డ్రైవర్ల కొరతతో పూర్తిస్థాయిలో ప్రజలకు బస్సు సర్వీసులను నడిపించలేకపోతున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. మధిర డిపో పల్లెవెలుగు 45 బస్సులు ఉన్నప్పటికీ 20 నుంచి 30 బస్సుల వరకు నిరుపయోగంగా డిపోకే పరిమితమై ఉంటున్నాయి. బస్సు సర్వీసులు నడిపించడంలో ఆర్టీసీ విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. డిపోలో బస్సులు ఉన్నా ప్రయోజనం లేదని వాపోతున్నారు. స్వయానా రాష్ట్ర డిప్యూటీ సీఎం ఇలాకాలో డ్రైవర్ల కొరత సమస్య వేధిస్తున్నా పట్టించుకునే వారేలేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.